# ఉక్కిరి బిక్కిరి

**రైతులను ఇబ్బంది పెడుతున్న వాతావరణం**

- చిరుజల్లులతో చేతికొచ్చిన పంటపై ఆందోళన
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 5: మిగ్‌జాం తుఫాను ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడ చిరు జల్లులు కురిశాయి. ఆరుగాలం కష్టపడ్డదంతా ఇలా అకాల వర్షాలు పాలవుతుందేమోనని రైతులు జంకుతున్నారు. వాతావరణంలో మార్పులతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎండ వస్తే వడ్లను ఆరబెట్టడం, మబ్బుపడితే తిరిగి కుప్ప చేస్తున్నారు. దీనికితోడు వారం రోజులుగా మంచుతో కూడిన వాతావరణమే దర్శనమిచ్చింది. ప్రస్తుతం వర్షపు జల్లులు కురుస్తుండడంతో ఏం చేయాలో రైతుకు పాలుపోవడం లేదు. వానకాలం సీజన్ ముగిసి వరి పంట చేతికి వచ్చే సమయంలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా మబ్బులు వస్తుండడంతో ఆ ప్రభావం పంటలపై పడుతోంది. హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నాయని ప్రకటించడంతో రైతన్నలు దిగాలుగా పంటలను ఎలా రక్షించుకోవాలని మదనపడుతున్నారు.

### కోత దశలో వరి పంట..

జిల్లాలో వరి పంట 1,39,410.34 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. 15 రోజుల నుంచే కోతలు మొదలు పెట్టారు. సన్న రకాలతో పాటు దొడ్డు రకమైన 1010 రకం పంటల కోతలు చివరి దశకు చేరుతుండగా, మరోవైపు 1001 రకం దొడ్డు వడ్ల కోతలు మొదలయ్యాయి. ఈ క్రమంలో వాతావరణంలో మార్పులు వచ్చి అక్కడక్కడ జల్లులు పడుతుండడంతో రైతులు కనిపించని దేవుడి కోసం ఆకాశం వైపు చూస్తు వానదేవుడు కరుణించి వర్షాలు ఆగాలని మొక్కుతున్నారు.

### పత్తి పంటకు భారీ నష్టం...

జిల్లాలో పత్తి పంట 1,47,515.39 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. దీపావళి నుంచే పత్తి ఏరడం మొదలు పెట్టిన రైతులు నవంబర్, డిసెంబర్



కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం

నెలల్లో రెండో దఫా, మూడో దఫా ఏరడం మొదలు పెడుతారు. ఈ సమయంలో జల్లులు పడుతుండడంతో పత్తి నల్లబడుతుందని భయపడుతున్నారు. అసలే పత్తికి అనుకున్న మద్ధతు ధర రావడం లేదని బాధపడుతుంటే దీనికి అదనంగా వరణుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడంతో పత్తి ఏరని రైతులు ఏం చేయాలో తోచక భారాన్ని దేవుడిపై మోపి వర్షం రాకూడదని వేడుకుంటున్నారు. ఏది ఏమైనా ఇలా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర నష్టపోవాల్సి వస్తోంది.

### జాగ్రత్తలు తీసుకోవాలి..

**-కల్పన, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మంచిర్యాల**

పత్తి ఏరిన రైతులు ఇండ్లలో భద్రపర్చుకున్నారు. కానీ వరి ధాన్యాన్ని మాత్రం రైతులు కొనుగోలు కేంద్రాల్లో, కొంత మంది ఇంటి వద్ద ఆరబోసుకున్నారు. వారం రోజులుగా మంచుతో రైతులు ఇబ్బంది పడగా, రెండు రోజులుగా తుఫాను ఎఫెక్ట్‌తో జిల్లాలో అక్కడక్కడ జల్లులు పడుతున్నాయి. మరో రెండు రోజులు వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వరి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు కుప్పలుగా చేసుకొని టార్ఫాలిన్‌లు, కవర్లతో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తుఫాను తగ్గిన తరువాత పలుచగా ఆరబోసుకొని ఆరిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి.



# మంచిర్యాలే కీలకం

**ఈ నెల 27న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ**

- 8వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ.. ఆ తర్వాతే పొత్తులపై స్పష్టత..
- మంచిర్యాల జిల్లాలోని మూడు ఏరియాల్లోనే అత్యధిక ఓట్లు
- ఇక్కడ ఎవరికి లీడ్ వస్తే వారే గెలిచే అవకాశం
- అప్రమత్తమైన కార్మిక సంఘాలు..
- ముమ్మర ప్రచారం దిశగా అడుగులు..

మంచిర్యాల, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యిందో లేదో.. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియ మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందుగానే అక్టోబర్ 28న ఈ ఎన్నికలు నిర్వహించేందుకు సెప్టెంబర్ 27వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో నామినేషన్లు తీసుకొని 10వ తేదీన పరిశీలన పూర్తి చేసిన అధికారులు 13 కార్మిక సంఘాలు బరిలో ఉన్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వాయిదా వేయాలని కోరారు. కోల్‌బెల్ట్ ఏరియా పరిధిలోని కలెక్టర్లు కూడా లేఖలు రాశారు. దీంతో హైకోర్టు ఇప్పటివరకు జరిగిన ప్రక్రియను ఇలాగే ఉంచి, డిసెంబర్ 27వ తేదీన ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీన గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు సిద్ధమయ్యారు. ఈ మేరకు నామినేషన్లు వేసిన 13 కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమైన ఎన్నికల ప్రత్యేక అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు ఎన్నికల ప్రక్రియను పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

### నామినేషన్ల ఉపసంహరణ అనంతరం స్పష్టత

ఈ నెల 8వ తేదీన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల కోసం వేసిన నామినేషన్ల ఉపసంహరణ ముగియనుంది.అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐకి పొత్తులున్న నేపథ్యంలో సింగరేణి ఎన్నికల్లోనూ ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ కలిసి పని చేస్తాయనే వార్తలు వినిపిస్తున్నాయి. అంటే 8వ తేదీ తరువాతే బరిలో ఉండే కార్మిక సంఘాలపై స్పష్టత రానున్నది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ప్రచారం మొదలుపెట్టాల్సి ఉన్న నేపథ్యంలో కార్మిక సంఘాలు అప్రమత్తమయ్యాయి. గేట్ మీటింగ్, సింగరేణి కాలనీల్లో ప్రచారానికి వ్యూహాలు రచించుకుంటున్నాయి. మంచిర్యాల జిల్లా సింగరేణి ఎన్నికల్లో కీలకం కానున్నది. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలు ఉండగా.. ఇందులో మూడు ఏరియాలు మన జిల్లా పరిధిలోకే రానున్నాయి. రాష్ట్రంలోని అన్ని ఏరియాల కంటే శ్రీరాంపూర్ ఏరియాలో అధిక ఓట్లు ఉన్నాయి. మందమర్రి కూడా పెద్ద ఏరియా కావడం, బెల్లంపల్లిలోనూ 1000 మంది కార్మికులు ఉండడంతో అన్ని సంఘాలు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించాయి. మొత్తం సింగరేణిలో 39,832 కార్మిక ఓటర్లు ఉండగా.. ఇందులో 14,985 మంది మంచిర్యాల జిల్లాలోని మూడు ఏరియాల్లోనే ఉండడం విశేషం. ఇక్కడ ఎవరికీ లీడ్ వస్తే వాళ్లే గుర్తింపు సంఘంగా గెలిచే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ ఈ ఎన్నికలను మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనుండగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఐఎన్‌టీయూసీ ఎలాగైనా సత్తా చాటాలని చూస్తున్నది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి ఇప్పుడు సింగరేణి ఎన్నికలపై పడింది.

**సింగరేణిలో డివిజన్లు / ఏరియాలవారీగా ఓటర్లు..**

| ఏరియా | ఓటర్లు |
|---|---|
| శ్రీరాంపూర్ | 9,124 |
| మందమర్రి | 4,876 |
| బెల్లంపల్లి | 985 |
| కొత్తగూడెం కార్పొరేట్ | 1,192 |
| కొత్తగూడెం డివిజన్ | 2,370 |
| మణుగూర్ | 2,414 |
| ఇల్లందు | 603 |
| ఒడిశా(నైనీ) | 02 |
| భూపాలపల్లి | 5,350 |
| రామగుండం-1 | 5,430 |
| ఆర్జీ-2 | 3,479 |
| ఆర్జీ-3 | 3,063 |
| ఏపీఏ | 944 |
| మొత్తం | 39,832 |



ఆసిఫాబాద్ జిల్లాలో యంత్రాలతో జోరుగా సాగుతున్న వరికోతలు

# కొనసాగుతున్న వరికోతలు

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సుమారు 63 వేల ఎకరాల్లో సాగు**

- ఎన్నికల నేపథ్యంలో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- కల్లాల్లోనే కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి.. జిల్లా వ్యాప్తంగా గతేడాది సుమారు 4.50 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 35 వేల ఎకరాల్లో సాగు పెరిగి, 4.85 లక్షల ఎకరాలకు చేరింది. పత్తి పంట తీయడం గత నెల రోజుల క్రితమే ప్రారంభం కాగా, వరి కోతలు 15 రోజుల క్రితమే ప్రారంభమయ్యాయి. దీంతో వ్యాపారులు కల్లాల్లోనే తాత్కాలిక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారుగా 3. 60 లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వరి పంట 63 వేల ఎకరాల్లో సాగుచేశారు. మక్క 574 హెక్టార్లలో, కంది 11547 హెక్టార్లలో, పెసర 1497 హెక్టార్లలో, మినుములు 534 హెక్టార్లలో, జొన్న 2164 హెక్టార్లలో, సోయాబీన్ 1929 ఎకరాల్లో, సాగయ్యాయి. ఈ ఏడాది పత్తి దిగుబడి కొంత మేరకు తగ్గినప్పటికీ, సుమారు 10 నుంచి 12 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో ఈ ఏడాది ఎన్నికల కారణంగా ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా జిల్లాలో ప్రారంభించలేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులు వరి కల్లాల్లోనే తాత్కాలిక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొంటున్నారు. క్వింటాలుకు రూ. 1900 నుంచి రూ. 2వేల వరకు చెల్లిస్తున్నారు. ఎఫ్‌సీఐ ద్వారా జిల్లాలో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో, వ్యాపారులే రంగంలోనికి దిగి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో గత ఐదేళ్ల కాలంలో సాగు విస్తీర్ణం భారీ స్థాయిలో పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో సాగు 4. 85 వేల ఎకరాల్లో సాగు అవుతున్నది. ఐదేళ్ల కాలంలో దాదాపు 1 లక్షా 10 వేల ఎకరాల్లో సాగు పెరిగింది. ఉచిత విద్యుత్, రైతులకు బోర్ల ద్వారా సాగునీరు పుష్కలంగా అందుతోంది. దీంతో గత దేళ్లుగా సాగునీరు వనరులు పెరగడంతో పంట సాగు పెరుగుతోంది. వరి ఎకరాకు 22 క్వింటాళ్ల నుంచి 24 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.



దహెగాంలో వ్యవసాయ క్షేత్రాల్లో వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

# ముమ్మరంగా వరి కొనుగోళ్లు

**జిల్లా వ్యాప్తంగా 199 కొనుగోలు సెంటర్ల ఏర్పాటు**

- వానకాలం సీజన్ కొనుగోలు లక్ష్యం 1,37,000 మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు విక్రయించిన 12,700 మంది రైతులు
- 63,096 మెట్రిక్ టన్నులు సేకరణ
- 6 వేల మంది ఖాతాల్లో రూ.62 కోట్ల చెల్లింపులు
- ఈ ఏడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.143 పెంపు
- 'గ్రేడ్-ఏ'కు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183



మామడ మండలం కొరిటికల్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వడ్లను ఆరబోసిన రైతులు

నిర్మల్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వానకాలం సీజన్‌కు సంబంధించి వరిపంట కొనుగోళ్ల కోసం అధికారులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 1,32,928 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, ఎకరానికి సగటున 18 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ విధంగా మొత్తం 2,39,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. ఏటా వానకాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా సన్నరకాలు వేస్తుంటారు. దీంతో స్థానిక అవసరాలు, సీడ్ కోసం దాదాపు లక్షా రెండు వేల మెట్రిక్ టన్నులు పోగా, మిగతా 1,37,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనున్నది. ఇందుకనుగుణంగానే జిల్లా వ్యాప్తంగా మొత్తం 221 వరి కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే చాలా చోట్ల వరికోతలు పూర్తి కావడంతో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌లతో పాటు సివిల్ సప్లై అధికారులు ప్రతి రోజు ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తూ సంబంధిత అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపడుతూనే, అవకతవకలపై కూడా దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా తరుగు, తేమ విషయంలో అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కడ కూడా చిన్న ఆరోపణలు వచ్చినా వెంటనే స్పందిస్తున్న అధికారులు... అక్కడ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఆయా మండలాల్లో వరి కోతలు ప్రారంభమైన ప్రాంతాల్లో 199 కేంద్రాలను ఏర్పాటు చేసి, ఇప్పటి వరకు మొత్తం 12,700మంది రైతుల నుండి 63,096 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 61,127 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటి వరకు దాదాపు 6 వేల మంది రైతులకు రూ.61 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. మిగతా రైతులకు సంబంధించిన డబ్బులను దశల వారీగా చెల్లించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే వరిధాన్యం పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు తరలి వస్తుండడంతో అధికారులు నిలువ విషయంలో చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేందుకు రవాణా వ్యవస్థను పకడ్బందీగా చేపడుతున్నారు.

### జిల్లా వ్యాప్తంగా 221 కేంద్రాల ఏర్పాటు...

కాగా వానకాలం సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్ల కోసం నిర్మల్ జిల్లాలో మొత్తం 221 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వీటిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే సెంటర్లు 36, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 99, డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో 81, జీసీసీ ఆధ్వర్యంలో 5 కేంద్రాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో వచ్చిన దిగుబడులను బట్టి ఇప్పటి వరకు 199 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అవసరాన్ని బట్టి మిగతా సెంటర్లను కూడా ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. అలాగే కొనుగోలు సెంటర్లకు అవసరమైన సామగ్రిని మార్కెటింగ్ శాఖ అధికారులు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 130 ప్యాడీ క్లీనర్లను అందజేయగా, అధనంగా మరో 95 ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు గత రెండు సీజన్లలో 2500 టార్పాలిన్లను రైతులకు పంపిణీ చేశారు. ఇంకా మార్కెట్ కమిటీల్లో 1850 వరకు టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ధాన్యాన్ని తూకం వేసేందుకు 304 ఎలక్ట్రానిక్ కాంటాలను సిద్ధంగా ఉంచారు. తేమ శాతాన్ని గుర్తించేందుకు 250 మీటర్లను అందుబాటులో ఉంచామని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. అంతే కాకుండా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నారు.

### 20 లక్షల గన్నీ బ్యాగులు సిద్ధం..

వానకాలం ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లాలో 20 లక్షల సంచులు సిద్ధంగా ఉన్నాయి. మిగతా గన్నీ బ్యాగులను వివిధ రూపాల్లో సేకరించి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మిల్లర్లతో పాటు, రేషన్ దుకాణాల నుంచి సంచులను తెప్పించారు. కాగా ఈ సారి ప్రభుత్వం వరి మద్దతు ధరను రూ.143 పెంచడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రేడ్-ఏ రకం క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర అందించనున్నది. ఈ సారి సకాలంలో వర్షాలు కురియడంతో జిల్లా వ్యాప్తంగా వరిపంట ఆశాజనకంగా ఉంది. వరికోతలు ముందుగానే ప్రారంభం కావడంతో అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేసింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ కోసం తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఒక లారీకి సరిపడా ధాన్యం బస్తాల తూకం పూర్తయిన వెంటనే కస్టమ్ మిల్లింగ్ కోసం తరలిస్తున్నారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ధాన్యం విక్రయించిన రైతులకు వెంట వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు.

### లక్షా 37వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం...

*నిర్మల్ జిల్లాలో ఈ వానకాలం సీజన్‌కు గాను 1,37,000మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళిక రూపొందించాం. ఆయా శాఖల ద్వారా మొత్తం 221 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే 199 సెంటర్లను ప్రారంభించాం. ప్రతి కేంద్రంలో ముందస్తుగానే సరిపడా గన్నీ సంచులు, ఇతర పరికరాలు ఉండేలా చర్యలు తీసుకున్నాం. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పిస్తున్నాం. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లోపు వారి ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కేంద్రాల నుంచి వెంటనే మిల్లులకు ధాన్యాన్ని తరలించేలా ఏర్పాట్లు చేశాం. ఇప్పటి వరకు 12,700 మంది రైతుల నుండి 63,096 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, రూ.62 కోట్ల చెల్లింపులు జరిపాం. త్వరలోనే మిగతా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం.*

**-కే.శ్రీకళ, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల శాఖ**



# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి

**-నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

లక్ష్మణచాంద, డిసెంబర్ 5: వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మండలంలోని వడ్యాల్, రాచాపూర్, లక్ష్మణచాంద వరి కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో కొనుగోలు చేసిన ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసేముందు సరైన తేమను పరిశీలించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీలత, కొనుగోలు కేంద్రాల సిబ్బంది ఉన్నారు.



లక్ష్మణచాంద: వరికొనుగోలు కేంద్రంలో అధికారులను వివరాలు అడుగుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్